

ఏయూ మెస్‌ల తనిఖీ

విశాఖ సిటీ: ఏయూ రెక్టార్ కిషోర్‌బాబు ఆర్ట్స్, కామర్స్, సైన్స్ హాస్టల్ మెస్‌లను తనిఖీ చేసి, అల్పాహారం నాణ్యతను పరిశీలించారు.



బయో డైవర్సిటీ పార్క్ సందర్శన

బీచ్‌రోడ్డు: బొబ్బిలికి చెందిన శ్రీ షిర్డీ సాయి డిగ్రీ కాలేజ్ బోటనీ విద్యార్థులు విశాఖలోని బయో డైవర్సిటీ పార్క్‌ను మంగళవారం సందర్శించారు.



భళా..బాల

'ఫ్యూచర్ ఆన్-2024'పేరుతో రెండు రోజులుగా నిర్వహిస్తున్న జోనల్ స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్ మంగళవారం ముగిసింది. 8లో

న్యూస్‌రీల్

పది ఎంపీడీవో పోస్టులు ఖాళీ

మాకవరపాలెం: ఉమ్మడి విశాఖ జిల్లాలో పది ఎంపీడీవో పోస్టులు ఖాళీగా ఉన్నాయని జిల్లా పరిషత్ సీఈవో నారాయణమూర్తి తెలిపారు. మండల పరిషత్ కార్యాలయాన్ని ఆయన మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా సిబ్బందితో మాట్లాడారు. రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఉమ్మడి విశాఖ జిల్లాలో మొత్తం 39 మండలాలకు గాను 29 మండలాలకే ఎంపీడీవోలు ఉన్నారన్నారు. మిగిలిన పది మండల పరిషత్‌లు ఇన్‌చార్జ్‌లతోనే కొనసాగుతున్నాయని ఆయన తెలిపారు. వీటిలో 8 పోస్టులు భర్తీ చేయాల్సి ఉందని, మరో ఇద్దరు దీర్ఘకాలిక సెలవులో ఉన్నారన్నారు.

జీవీఎంసీకి రాష్ట్ర స్థాయి అవార్డు

మహారాణిపేట: 2023–24వ సంవత్సరానికి గాను పీఎం స్వనిధి పథకాన్ని అమలు పరచడంలో జీవీఎంసీకి రాష్ట్ర స్థాయి అవార్డు లభించింది. మంగళవారం విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఈ అవార్డును రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి పి.నారాయణ చేతుల మీదుగా జీవీఎంసీ కమిషనర్ డాక్టర్ పి.సంపత్ కుమార్ అందుకున్నట్టు జీవీఎంసీ యూసీడీ పీడీ సత్యవేణి తెలిపారు. జీవీఎంసీ పరిధిలో పీఎం స్వనిధి పథకంలో లోన్లు మంజూరుకు గాను 20,697 దరఖాస్తులు రిజిస్టర్ చేశామని, వాటిని అమలు పరచడంలో యూసీడీ విభాగం సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ కనబరిచారని పేర్కొన్నారు.

న్యాయసేవల హెల్ప్‌లైన్ నంబర్ 15100

నర్సీపట్నం: న్యాయ సేవల కోసం 15100 హెల్ప్‌లైన్ ఏర్పాటు చేసినట్లు మండల లీగల్ సెల్ సర్వీసెస్ కమిటీ, సీనియర్ సివిల్ జడ్జి పఠాన్ షీయాజ్ ఖాన్ తెలిపారు. బాధితులు తమ సమస్యలపై హెల్ప్‌లైన్ ద్వారా న్యాయసేవలు పొందవచ్చన్నారు. సుప్రీంకోర్టు మార్గదర్శకాల మేరకు ప్రజల కోసం నేషనల్ లీగల్ సర్వీసెస్ సిస్టం పోర్టల్‌ను, ఉచిత హెల్ప్‌లైన్‌ను ఏర్పాటు చేసినట్లు జడ్జి తెలిపారు. బాధితులెవరైనా హెల్ప్‌లైన్‌కు ఫోన్ చేసి న్యాయసేవలు పొందవచ్చన్నారు.

దీపావళి సందడేది..!

దీపావళి అంటేనే బాణసంచా వెలుగులు.. పిల్లల కేరింతలు... సరదాలు. కొద్ది రోజుల్లోనే మంచి లాభాలు తెచ్చిపెట్టే ఈ పండగంటే వ్యాపారులకూ ఇష్టమే. కానీ ఈ ఏడాది అలాంటి వెలుగుల వేడుక పెద్ద సందడి లేకుండానే వచ్చి వెళ్లిపోయేలా కనిపిస్తోంది. ఎప్పటిలాగే ఈసారి కూడా బాణసంచా ధరలు పెరిగాయి. ఇప్పటికే పెరిగిన నిత్యావసరాల ధరలతో సతమతమవుతున్న సామాన్యుడు దీపావళిని తలచుకొని దిగులు చెందాల్సిన దుస్థితి నెలకొంది. పులి మీద పుట్రలా అధికార యంత్రాంగం వైఖరి వ్యాపారులకు నష్టాలు తెచ్చిపెట్టేలా ఉంది. దీపావళికి రెండు రోజుల ముందు మంగళవారం రాత్రి వరకు ఇంకా పూర్తి స్థాయిలో దుకాణాలకు అనుమతి ఇవ్వకపోవడంతో వారు తలలు పట్టుకుంటున్నారు.

- నిత్యావసరాల ధరల పెరుగుదలతో ఒకపక్క సామాన్యుడు సతమతం
- మరోపక్క బాణసంచా స్టాళ్లకు అనుమతుల్లో గందరగోళం
- చివరి క్షణం వరకు తేల్చకపోవడంతో వ్యాపారులు డీలా
- సరకు కదలక హోల్‌సేలర్ల ఆందోళన
- ఇంతవరకు 10 శాతం అమ్మకాలు జరగలేదని ఆవేదన



గుట్టలుగా పడి ఉన్న బాణసంచా సరకు



సాక్షి, అనకాపల్లి: దీపావళి వస్తోందంటే చాలు వారం పది రోజుల ముందు నుంచే హడావుడి మొదలయ్యేది. మందుగుండు సామగ్రి కొనమని పిల్లలు మారాం చేయడం, కొని తీసుకొస్తే గంతులు వేయడం, దీపావళి రోజు వరకు ఆగకుండా ముందే కొంచెకొంచెం కాలుస్తూ సరదా తీర్చుకోవడం కనిపించేది. అక్కడక్కడా బాంబుల మోత, చిన్నారులు తుపాకులు పేల్చడం వినిపించేది. కానీ ఈసారి అంతా నిశ్శబ్దం. ఈ ఏడాది బాణసంచా ధరలు 20 నుంచి 25 శాతం పెరిగాయని వ్యాపారులు చెబుతున్నారు. ఇది ప్రతి ఏటా ఉండే ముచ్చటే అయినా పిల్లల సరదా కాదనలేక తల్లిదండ్రులు ఎంత ఖర్చయినా భరించేవారు. అయితే ఈసారి విచిత్రంగా కొందామంటే సరకు అందివ్వలేని పరిస్థితి కనిపిస్తోంది. దుకాణాల కేటాయింపే పూర్తి స్థాయిలో మంగళవారం రాత్రి వరకు కొలిక్కిరాకపోవడంతో సరకు కదలక హోల్‌సేల్ వ్యాపారులు టెన్షన్ పడుతున్నారు. రెవెన్యూ డిపార్ట్‌మెంట్ వారు కొన్నిచోట్ల స్టాళ్లకు స్థలమే కేటాయించకపోవడం వారికి ఆందోళన కలిగిస్తోంది. చేయి తడిపితే గానీ రెవెన్యూ, పోలీస్, ఫైర్ డిపార్ట్‌మెంట్ల వారు స్పందించడం లేదని గోల పెడుతున్నారు. వారం రోజులకు ముందే దరఖాస్తులు వచ్చినప్పటికీ అనుమతి ఇప్పటికీ ఇవ్వకపోవడంతో వ్యాపారులు డీలా పడుతున్నారు. సందట్లో సడేమియాలా దుకాణాల కేటాయింపునకు కూటమి నేతల సిఫార్సులు తోడవ్వడంతో అధికారులు తలలు పట్టుకుంటున్నారు. జిల్లాలో ఐదుగురు హోల్‌సేలర్లు ఉన్నారు. దీపావళికి వారం రోజుల ముందే బాణసంచా స్టాక్ తెచ్చిపెట్టుకున్నారు. కానీ రిటైల్ వ్యాపారులు ఆశించిన స్థాయిలో రాక ఆందోళన పడుతున్నారు. జిల్లావ్యాప్తంగా ప్రతి ఏటా రూ.5 కోట్ల నుంచి రూ.6 కోట్ల వ్యాపారం జరుగుతుంది. ఈసరికి సగం వ్యాపారం జరిగేది. కానీ ఈసారి ఇప్పటికి 10 శాతం కూడా బాణసంచా విక్రయాలు జరగలేదని హోల్‌సేలర్లు చెబుతున్నారు.

కానరాని ఉత్సాహం

దీపావళి పండగ వచ్చిందంటే బంగారు, వస్త్ర దుకాణాలు, నిత్యావసర వస్తువుల మార్కెట్లు జనంతో కిటకిటలాడేవి. బాణాసంచా స్టాళ్లల్లో విక్రయాలు ప్రారంభమయ్యేవి. కానీ ఈ ఏడాది ధరలు ఆకాశాన్నంటడంతో ఎక్కడా ఉత్సాహం కానరావడం లేదు. దానికి తోడు సంక్షేమ పథకాలు అందకపోవడంతో సామాన్యులు గడ్డు పరిస్థితి ఎదుర్కొంటున్నారు. సూపర్ సిక్స్ అంటూ ఊదరగొట్టి రైతు భరోసా, అమ్మ ఒడి, మత్స్యకార భరోసా వంటి పథకాలు సైతం ఇవ్వకుండా కాలం వెళ్లదీస్తున్న కూటమి ప్రభుత్వం తీరుతో జనం అప్పుల పాలవుతున్నారు. అందుకే పండగంటే ఆసక్తి చూపించడం లేదు. కరోనా తరువాత గత రెండేళ్లలో బాణసంచా వ్యాపారం మళ్లీ ఊపందుకుంది. ఈసారి నిరుత్సాహం నెలకొంది.

జిల్లాలో అరకొర అనుమతులు..

- జీవీఎంసీ పరిధిలోని అనకాపల్లి ఎన్టీఆర్ క్రీడా మైదానంలో, రింగ్‌రోడ్డులో గల బెల్లం మార్కెట్ షాపుల దగ్గర 40 స్టాళ్లకు అనుమతి ఇచ్చారు.
- నర్సీపట్నం డివిజన్‌లో పాయకరావుపేట, నక్కపల్లి, ఎస్.రాయవరం, మాడుగుల, రావికమతం, రోలుగుంట, మాకవరపాలెం, కోటవురట్ల, నాతవరం, నర్సీపట్నం, గొలుగొండ మండలాల పరిధిలో 72 స్టాళ్లకు అనుమతి ఇచ్చారు. వీటిలో నర్సీపట్నం టౌన్ పరిధిలో 36 స్టాళ్ల ఏర్పాటు చేస్తున్నారు.
- చోడవరం టౌన్‌లో 30, యలమంచిలి టౌన్‌లో 17, మాడుగుల మండల పరిధిలో 23 స్టాళ్లకు అనుమతి ఇచ్చారు. ఇంకా అనేక ప్రాంతాల్లో అనుమతులు ఇవ్వలేదు.

అడ్డగోలు బదిలీకి ఆన్‌లైన్ పేమెంట్

- పంచాయతీరాజ్‌లో లోపించిన పారదర్శకత
- ఈవోపీఆర్ అండ్ ఆర్‌డీ బదిలీల్లో అక్రమాలు
- జెడ్పీ సీఈవో విచారణలో వెలుగులోకి వస్తున్న కొత్త అంశాలు

మహారాణిపేట (విశాఖ): పంచాయతీరాజ్‌లో అడ్డగోలు బదిలీల వ్యవహారం చిచ్చు రేపుతోంది. ఆన్‌లైన్ వేదికగా లంచాలకు తెరలేపడంతో ఈ వ్యవహారం ఎవరి మెడకు చుట్టుకుంటుందోనని ఆందోళన రేగుతోంది. ఉమ్మడి విశాఖ కేంద్రంగా పంచాయతీ రాజ్ అండ్ రూరల్ డెవలప్‌మెంటు కార్యనిర్వహణాధికారి (ఈవోపీఆర్ అండ్ ఆర్‌డీ) బదిలీలు జరిగిన సంగతి తెలిసిందే. బదిలీల్లో పారదర్శకత లోపించింది. ఎవరైతే భారీగా డబ్బులు సమర్పించుకున్నారో వారికి కావాల్సిన చోట పోస్టింగులు దక్కాయి. ఈ వ్యవహారంపై గత నెలలో సాక్షి దినపత్రికలో వరుస కథనాలు ప్రచురితం కావడంతో అధికారులు ఉలిక్కిపడ్డారు. కలెక్టర్ ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకుని జెడ్పీ సీఈవో పి.నారాయణ మూర్తిని విచారణ అధికారిగా నియమించారు. విచారణలో అనేక ఆసక్తికరమైన విషయాలు వెలుగు చూస్తున్నాయి. అల్లూరి సీతారామరాజు జిల్లాలో పని చేస్తున్న ఈవోపీఆర్ అండ్ ఆర్‌డీల జాబితా ఇవ్వాలని సీఈవో కోరిన విషయం తెలిసిందే. ఈ జాబితా ఇస్తే తమ లొసుగులు బయటపడతాయన్న కారణంగా సాంకేతిక కారణాలు చూపిస్తూ జాబితా ఇవ్వడానికి నాన్చుతున్నారు. ఇదిలావుండగా వాటాల్లో తేడాలు వచ్చి విభేదాలు తలెత్తడంతో ఆన్‌లైన్ చెల్లింపుల వ్యవహారం బయటకు వచ్చింది. ఫోన్ పే, గూగుల్ పే ద్వారా జరిగిన లావాదేవీలను కొంతమంది బయట పెట్టడానికి సిద్ధమవుతున్నట్టు తెలుస్తోంది. బదిలీకి ముందు కొంత.. తరువాత కొంత డబ్బు ఇచ్చేందుకు ఉద్యోగులు ఒప్పందం కుదుర్చుకున్నారు. సాక్షి వరుస కథనాలతో కోరుకున్న చోటుకు బదిలీ అయిన ఉద్యోగులు మిలిగిన డబ్బులు ఇవ్వకపోవడంతో పంచాయతీ అధికారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నట్టు సమాచారం. కొంతమంది ఫోన్లు చేసి బెదిరింపులకు దిగుతున్నట్టు తెలిసింది. ఈ వ్యవహారం చినికి చినికి గాలి వానగా మారడంతో ఆన్‌లైన్ పేమెంట్ చేసిన ఉద్యోగులు స్క్రీన్ షాట్లతో సంబంధిత అధికారులపై ఎదురు తిరుగుతున్నట్టు సమాచారం. జెడ్పీ సీఈవో మరింత పకడ్బందీగా విచారణ జరిపితే సూత్రధారులెవరో.. పాత్రధారులెవరో బయటపడుతుందన్న చర్చ నడుస్తోంది.

కొత్త ఓటర్ల నమోదుకు నెల రోజుల గడువు

- 18 ఏళ్లు నిండిన వారు ఓటు హక్కు పొందాలి
- జిల్లా రెవెన్యూ అధికారి దయానిధి



మాట్లాడుతున్న డీఆర్వో దయానిధి

తుమ్మపాల: ఓటరు జాబితా నవీకరణ ప్రత్యేక సంక్షిప్త సవరణ–2025 షెడ్యూల్‌ను కేంద్ర ప్రభుత్వం విడుదల చేసినట్టు జిల్లా రెవెన్యూ అధికారి బి.దయానిధి చెప్పారు. మంగళవారం కలెక్టరు కార్యాలయంలో తన చాంబరులో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే జనవరి 1 నాటికి 18 సంవత్సరాలు పూర్తి చేసుకున్నవారు ఓటరుగా నమోదు కావాలన్నారు. రాజకీయ పార్టీల కార్యకర్తలు ప్రజలకు చైతన్యం కలిగించాలన్నారు. 2025 జనవరి 1, ఏప్రిల్ 1, జూలై 1, అక్టోబర్ 1 నాటికి 18 సంవత్సరాల వయస్సు నిండిన, నిండుతున్నవారు ఈనెల 29 నుంచి వచ్చే నెల 28 వరకు ఓటరుగా నమోదు చేసుకోవడానికి దరఖాస్తులు సమర్పించవచ్చునన్నారు. నవంబర్ 9, 10, 23, 24 తేదీలను ప్రత్యేక ప్రచార రోజులుగా ప్రకటించారని, ఆ రోజులలో బూత్ లెవెల్ అధికారులు పోలింగ్ కేంద్రాల వద్ద ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తులు స్వీకరిస్తారన్నారు. ఫారం 6 ద్వారా కొత్తగా పేరు నమోదు, ఫారం 7 ద్వారా తొలగింపులు, అభ్యంతరాలు తెలపడానికి, ఫారం 8 మార్పులకు వినియోగించుకోవాలని తెలిపారు. బూత్ లెవెల్ అధికారి కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించవచ్చునని, ఆన్‌లైన్ ద్వారా www.voters.eci.gov.in పోర్టల్‌లో లాగిన్ అయి ఆన్‌లైన్ ఫారాలను సమర్పించవచ్చునని తెలిపారు. ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ ఎస్.ఎస్.వి.నాయుడు, వైఎస్సార్‌సీపీ, ఆప్, టీడీపీ, సీపీఐ, బీజేపీ ప్రతినిధులు ఎం.జానకీరామరాజు, కె.హరినాథబాబు, బొలిశెట్టి శ్రీనివాసరావు, అల్లురాజు, పి.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

రేపటి నుంచి 'దీపం-2' పథకం

- అర్హులకు ఏడాదికి 3 ఉచిత సిలిండర్లు



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ ఎం.జాహ్నవి

తుమ్మపాల: ప్రభుత్వం అందిస్తున్న దీపం పథకం ఈ నెల 31 నుంచి ప్రతి లబ్ధిదారుడికి అందించేలా చర్యలు తీసుకోవాలని జేసీ ఎం. జాహ్నవి అన్నారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో సివిల్ సప్లయి అధికారులు, గ్యాస్ డీలర్లతో సమావేశం నిర్వహించారు ఈ సమావేశంలో ఆమె మాట్లాడుతూ అర్హులైన లబ్ధిదారులకు 'దీపం పథకం-2' ద్వారా ప్రతి సంవత్సరం మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లను సరఫరా చేయనున్నామన్నారు. ఆధార్ కార్డు నెంబరు, రేషన్/ బియ్యం కార్డు నెంబరు, ఆధార్ నెంబర్‌తో లింకు చేసిన బ్యాంకు ఖాతా, గ్యాస్ కనెక్షన్ నెంబరు ఉన్న గ్యాస్ వినియోగదారులు ఈ పథకానికి అర్హులన్నారు. అర్హత గల లబ్ధిదారులకు ఈ నెల 31వ తేదీ నుంచి ఉచిత గ్యాస్ సిలిండర్ సరఫరా ప్రారంభిస్తారని, గ్యాస్ బుక్ చేసుకునేందుకు అర్హత గల లబ్ధిదారులకు ఈ నెల 31వ తారీఖు నుంచి 2025 మార్చి నెల 31 వరకు అవకాశం ఉంటుందని, ఐదు నెలల వరకు దీపం–2 పథకం మొదటివిడతగా సరఫరా జరుగుతుందన్నారు. జిల్లాలో గల అన్ని గ్యాస్ కంపెనీల లబ్ధిదారుల జాబితా online పోర్టల్‌లో అందుబాటులో ఉందని, ఈ నెల 29వ తేదీ నుంచి లబ్ధిదారులు తమ గ్యాస్ ఏజెన్సీలో సిలిండర్ కోసం బుకింగ్ చేసి గ్యాస్ ధర ఏజెన్సీకి మొదట చెల్లిస్తే లబ్ధిదారుడి మొబైల్ నంబరుకు ఒక మెసేజ్ వస్తుందన్నారు. మెసేజ్ వచ్చిన లబ్ధిదారు చెల్లించిన మొత్తం సొమ్ము గ్యాస్ సిలిండర్ డెలివరీ అయిన 48 గంటల్లోగా వారి ఆధార్ అనుసంధానం గల బ్యాంక్ ఖాతాకు జమ అవుతుందన్నారు.

ఆయిల్ కంపెనీలు, గ్యాస్ పంపిణీదారులు తగిన గ్యాస్ సిలిండర్ల నిల్వలు బుకింగ్‌లకు అనుగుణంగా పంపిణీకి సిద్ధంగా ఉంచుకోవాలని, జిల్లాలో గల ఇండియన్ గ్యాస్, భారత్ గ్యాస్, హిందుస్థాన్ పెట్రోలియం గ్యాస్ కంపెనీల పరిధిలో గల తమ తమ గ్యాస్ పంపిణీదారులకు స్పష్టమైన ఆదేశాలు ఇవ్వాలని ఆమె తెలిపారు. లబ్ధిదారుల సిలిండర్లు అక్రమంగా అమ్మకాలు చేయకుండా చర్యలు తీసుకోవాలని, రోడ్ పక్కన, జాతీయ రహదారిలో గల కాఫీ హోటల్స్, టీ స్టాల్స్ , ఇతర ప్రాంతాల్లో ఈ పథకానికి సంబంధించిన గ్యాస్ బండలు (గ్యాస్ సిలిండర్లు) అక్రమంగా వినియోగం జరిపిన వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

ఇసుక మాఫియా మధ్య రగడ

- జనసేన కార్యకర్తను చితక్కొట్టిన టీడీపీ వర్గీయులు
- అతనికి సాయంగా వచ్చిన వ్యక్తిపై బ్లేడ్‌తో దాడి




నర్సీపట్నం ఆస్పత్రిలో పొందుతున్న మౌళి

కోటవురట్ల: ఇసుక మాఫియా మధ్య జరిగిన ఓ మందు పార్టీ వివాదానికి కారణమైంది. వివాదం కాస్త కొట్లాటకు దారితీసి ఓ యువకుడి ప్రాణాల మీదికి తీసుకొచ్చింది. గొట్టివాడ శివారు పైలట్ ప్రాజెక్టుకు సమీపంలో కొంతకాలంగా ఇసుక మాఫియా దందా సాగిస్తోంది. రామచంద్రపురం శివారు గూడెపులోవ గ్రామానికి చెందిన టీడీపీ, జనసేన నాయకులు రెండు వర్గాలుగా ఇసుక అక్రమ రవాణా చేస్తున్నారు. నాటుబళ్లతో వరాహనది నుంచి ఇసుకను ఒడ్డుకు చేర్చి మామిడి తోటల్లో నిల్వ చేస్తున్నారు. అక్కడి నుంచి లారీల్లో తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. ఓ లారీ ఓనరు ఇరు వర్గాలకు మంగళవారం మందు పార్టీ ఇచ్చాడు. పార్టీలో గొడవ ముదిరి జనసేనకు చెందిన ఓ వ్యక్తిని టీడీపీ వర్గీయులు చితక్కొట్టారు. ఈ వివాదంలో దెబ్బలు తిన్న వ్యక్తి వర్గానికి చెందిన కోన మౌళి అక్కడకు వచ్చాడు. మద్యం మత్తులో ఉన్న టీడీపీ వ్యక్తులు కోన మౌళిపై బ్లేడ్‌తో దాడి చేశారు. ఈ దాడిలో మౌళికి గొంతు తెగిపోయి తీవ్రంగా రక్తస్రావం కావడంతో హుటాహుటిన కోటవురట్ల సీహెచ్‌సీకి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తీసుకొచ్చారు. ప్రస్తుతం ప్రాణాపాయం లేదని బంధువులు తెలిపారు. బాధితుడు మౌళి మాట్లాడుతూ పాకలపాడుకు చెందిన పాము తులసీరావు అనే వ్యక్తి తనపై బ్లేడుతో దాడి చేసినట్టు తెలిపాడు. బాధితుడి తరపున ప్రసాదుల నానాజీ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఎస్‌ఐ రమేష్ మాట్లాడుతూ భూతగాదాలో ఓ వ్యక్తి గాయపడ్డాడని, కేసు నమోదు చేసినట్టు తెలిపారు.

ప్రకృతి సంపద ప్రజలందరికీ చెందాలి

- ఉచిత ఇసుక విషయంలో ఎలాంటి అక్రమాలను సహించం
- చట్టబద్ధంగా నడుచుకునే క్వారీ నిర్వాహకులకు తోడుంటాం
- మంత్రి కొల్లు రవీంద్ర వెల్లడి



మాట్లాడుతున్న మంత్రి కొల్లు రవీంద్ర

మహారాణిపేట (విశాఖ): ప్రకృతి ప్రసాదించిన వనరులను ప్రతి ఒక్కరికీ చెందేలా చూసుకునే బాధ్యత రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటుందని రాష్ట్ర గనులు భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. జిల్లా పరిషత్ కార్యాలయంలో ఉత్తరాంధ్ర జిల్లాల మైనింగ్ అధికారులు, క్వారీ నిర్వాహకులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. మైనింగ్ వ్యవస్థను ప్రక్షాళన చేసి మెరుగైన పాలనకు శ్రీకారం చుట్టబోతున్నామన్నారు. క్రషర్ యజమానులు, మైనింగ్ కంపెనీల యజమానులతో సీనరేజి వసూలు చేసే సంస్థలు సఖ్యతతో నడుచుకోవాలని ఆదేశించామన్నారు. పెత్తనం చేయాలని చేస్తే చూస్తూ ఊరుకోబోమన్నారు. ఉత్తరాంధ్రలో అమూల్యమైన ప్రకృతి వనరులున్నాయని, వాటిని సద్వినియోగం చేసుకుంటే ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. ప్రజలకు ఉచితంగా ఇసుక అందించాలనే ఉద్దేశంతో జులై 8న పాలసీ ప్రకటించినా.. వర్షాల వల్ల రాష్ట్రంలో ఇసుక తవ్వకాలను ప్రారంభించలేని పరిస్థితి నెలకొందన్నారు. దాన్ని ప్రతిపక్షాలు రాద్ధాంతం చేస్తున్నాయన్నారు. విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాల్లో ఇసుక కొరతను నివారించేందుకు గోదావరి జిల్లాల్లో ఐదు రీచుల్ని ప్రత్యేకంగా కేటాయించామన్నారు. సమావేశంలో ఎమ్మెల్యేలు పల్లా శ్రీనివాస్, పంచకర్ల రమేష్‌బాబు, వంశీకృష్ణ శ్రీనివాస్, ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ముసాయిదా ఓటర్ల జాబితా విడుదల

- ఈ ఏడాది జనవరి నాటికి 12,73,591
- తాజా ముసాయిదా జాబితా 12,89,870
- 16,279 మంది ఓటర్లు పెరుగుదల

సాక్షి, అనకాపల్లి: జిల్లాలో ముసాయిదా ఓటర్ల జాబితా విడుదల చేశారు. ఈ ఏడాది జనవరి ఒకటో తేదీన విడుదల చేసిన తుది ఓటర్ల జాబితా కన్నా ముసాయిదా ఓటర్లు గణనీయంగా పెరిగారు. అనకాపల్లి జిల్లాలోని ఆరు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ప్రస్తుతం ఉన్న ఓటర్లు వివరాలను జిల్లా రెవెన్యూ అధికారి దయానిధి మంగళవారం ప్రకటించారు. ఈ ఏడాది జనవరి నాటికి 12,73,591 మంది ఓటర్లు ఉండగా.. ముసాయిదా జాబితాలో ఓటర్లు 12,89,870 మంది ఉన్నారు. అంటే గతం కంటే 16,279 మంది ఓటర్లు పెరిగారు. మొత్తమ్మీద 1.27 శాతం మంది ఓటర్లు పెరిగారు. ఇప్పుడు ఈ ముసాయిదా ఓటర్ల జాబితాలో కొత్తగా పేర్లు నమోదు చేసుకోవడం, తొలగింపులు, సవరణల కోసం వచ్చే నెల 28వ తేదీ వరకు గడువు ఉంది. క్లెయిమ్‌లు, అభ్యంతరాల పరిష్కారం కోసం డిసెంబర్ 24వ తేదీ వరకు గడువు ఉంది. తుది ఓటర్ల జాబితాను వచ్చే ఏడాది జనవరి 6న ప్రచురించనున్నారు. వచ్చే ఏడాది జనవరి ఒకటో తేదీ నాటికి 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటర్లుగా నమోదుకు అవకాశం ఉంది.

గణేష్‌కు జాతీయ పురస్కారం



టీఎస్ ఆర్టీసీ ఎండీ సజ్జనార్ నుంచి పురస్కారం స్వీకరిస్తున్న గణేష్

మునగపాక: మండలంలోని టి.సిరసపల్లికి చెందిన కొమ్మోజు గణేష్ యంగ్ ఇండియన్ జాతీయ స్థాయి సేవా పురస్కారం అందుకున్నారు. హైదరాబాద్‌లోని పొట్టి శ్రీరాములు యూనివర్సిటీలో ఇండియన్ బ్లడ్ డోనర్స్ క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో టీఎస్ ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్ చేతుల మీదుగా ఆయన ఈ పురస్కారం స్వీకరించారు. నిరంతర్ సేవా ఫౌండేషన్ ద్వారా గణేష్ ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో రక్తదానంపై అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారు. రక్తదాన శిబిరాలు, అత్యవసర సమయాల్లో రక్తాన్ని సమకూర్చడం వంటి కార్యక్రమాలు నిర్వహిస్తుంటారు. ఈ మేరకు గణేష్ సేవలను గురించి ఈ పురస్కారానికి ఎంపిక చేశారు. పురస్కారం అందుకున్న గణేష్‌కు పలువురు అభినందనలు తెలిపారు.

భళా.. బాల

- ముగిసిన 'ఫ్యూచర్ ఆన్-2024'
- ఆలోచింపజేసిన నమూనాలు
- సత్తాచాటిన మధురవాడ, సబ్బవరం గురుకుల విద్యార్థులు



జోనల్ స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్ పోటీల్లో విజేతలతో అతిథులు

మధురవాడ: బాల మేధావుల సృజనాత్మకత వెల్లివిరిసింది. కొమ్మాది రిక్షా కాలనీ(మధురవాడ)లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ వేదికగా 'ఫ్యూచర్ ఆన్-2024'పేరుతో రెండు రోజులుగా నిర్వహిస్తున్న జోనల్ స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్ మంగళవారం ముగిసింది. ఉత్తరాంధ్ర జిల్లాల్లో జరిగిన పోటీల్లో 33 గురుకులాలకు చెందిన 150 మంది విజేతలుగా నిలిచి జోనల్‌స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వీరు రూపొందించిన 88 నమూనాలు ఇక్కడ కొలువు దీరాయి. ఆతిథ్యం ఇచ్చిన రిక్షా కాలనీలోని అంబేడ్కర్ గురుకుల సీవోఈ ఐదు, సబ్బవరం గురుకుల పాఠశాల 3 బహుమతులు గెలుచుకుని సత్తా చాటాయి.

రాష్ట్రస్థాయి పోటీలకు 18 నమూనాలు

జూనియర్, సీనియర్ విభాగాల్లో 8 చొప్పున, ఆర్ట్స్ అండ్ క్రాఫ్టల నుంచి రెండు.. మొత్తంగా 18 నమూనాలను న్యాయనిర్ణేతలుగా వ్యవహరించిన ఏయూ ప్రొఫెసర్లు ఎంపిక చేశారు. నవంబర్‌లో పల్నాడు జిల్లా ఆర్.కె. పురంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో వీరు నమూనాలను ప్రదర్శించనున్నారు. ఏపీఎస్‌డబ్ల్యూఆర్ఈఐ సొసైటీ జాయింట్ సెక్రటరీ ఎ.మురళీకృష్ణ విజేతలకు బహుమతులు, ధ్రువీకరణపత్రాలు అందజేశారు. డీజీవో రూపావతి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆర్ఐవో మురళీధర్, ప్రిన్సిపాల్ శాంతికుమారి, పాఠశాల కమిటీ చైర్మన్ బగాది జగదీశ్వరరావు, డీసీవోలు బాలాజీ నాయక్, ఫోరెన్స్ పాల్గొన్నారు.

జోనల్‌స్థాయి విజేతలు వీరే..

సీనియర్స్ విభాగంలో 'సైన్స్' విజేతగా పి.గౌతమ్, పార్వతీపురం(అన్‌పొల్యూటెడ్ పేపర్ అండ్ కప్స్ మేకింగ్), రన్నరప్‌గా రమణమ్మ, హర్షిత, సీవోఈ, మధురవాడ (ఐవోటీ బేస్డ్ ఫుడ్ పాయిజనింగ్ డిటెక్టింగ్ సిస్టం) నిలిచారు. సోషల్ విభాగంలో విజేతగా పి.లక్ష్మిప్రియ, పి.త్రివేణి, కొక్కిరాపల్లి (డిజాస్టర్ మేనేజ్‌మెంట్), రన్నరప్‌గా స్ఫూర్తి, యశోద, ఎచ్చెర్ల (ఆర్గానిక్ ఫార్మింగ్), మ్యాథ్స్ విభాగంలో విజేతగా రాజేశ్వరి, హనిహర్షిత (కార్టీసియన్ ప్లేన్), రన్నరప్‌గా ఆకాష్, దుర్గాప్రసాద్, సీవోఈ, మధురవాడ (యూజ్ ఆఫ్ మ్యాథమెటికల్ ఇన్ వాచ్ భారత్), ఐసీటీ విభాగంలో విజేతగా రూడా ఇవాంజలిన్, ప్రవల్లిక, సాయిప్రియ (ఐవోటీ బేస్డ్ కార్ పార్కింగ్ సిస్టం), రన్నరప్‌గా చిరంజీవి, కుమార్, కొల్లివలస (హార్వెస్టింగ్ క్రాప్ ప్రొటెక్టర్) గెలుపొందారు. ఆర్ట్స్ విభాగంలో విజేతగా కార్తీక్, ఎం.బాలు(శ్రీకృష్ణాపురం), రన్నరప్‌గా దుర్గాప్రవీణ్, సుధీర్(దేవరాపల్లి), క్రాఫ్ట్ విభాగంలో విజేతగా విజయ్‌కుమార్, తేజ, సాగర్(బాడంగి), రన్నరప్‌గా దీపికాదేవి(మేహాద్రిగెడ్డ)నిలిచారు.

- జూనియర్స్ విభాగంలో 'సైన్స్'విజేతగా కె.శివకుమార్, ఎ.నవదీప్, సబ్బవరం (వెర్టికల్ ఫార్మింగ్), రన్నరప్‌గా సందీప్, దుర్గాప్రసాద్, దుప్పలవలస (ఓల్డేజ్ పీపుల్ సర్వింగ్ వీల్ చైర్), సోషల్ విభాగంలో విజేతగా శ్యామల, మోహనప్రియాంక, సీవోఈ, మధురవాడ (ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్‌మెంట్), రన్నరప్‌గా భవ్యశ్రీ, కొమరాడ (గిరిజనుల సమస్యలు), మ్యాథ్స్ విభాగంలో విజేతగా తనూజ, నిస్సీ, సీవోఈ, మధురవాడ (ప్రోపర్టీస్ ఆఫ్ ది సర్కిల్స్), రన్నరప్‌గా రిత్విక, అశ్విన్, తాళ్లపాలెం (మ్యాథమెటిక్స్ ఇన్ అవర్ డైలీ లైఫ్) నిలిచారు. ఐసీటీ విభాగంలో విజేతగా విశ్వనాథ్, అశోక్, సబ్బవరం (హ్యూమన్ హెల్త్, ట్రాఫిక్ అలర్ట్ అండ్ ఎన్విరాన్‌మెంట్ ప్రొటెక్షన్ సిస్టం), రన్నరప్‌గా సంజన, వియ్యంపేట (ఎఫెక్టివ్ ట్రైన్ ప్లాట్‌ఫార్మ్ క్రాసింగ్ సిస్టం), ఆర్ట్ విభాగంలో విజేతగా ప్రసన్నకుమార్, దుర్గారావు(దుప్పలవలస),రన్నరప్‌గా నిఖిల్, మోహనరావు(కొల్లివలస), క్రాఫ్ట్ విభాగంలో విజేతగా మున్న, సంపత్ వినయ్(సబ్బవరం), రన్నరప్‌గా హిమవర్షిణి(చీపురుపల్లి) గెలుపొందారు.

సర్పంచ్ దంపతులపై పందుల పెంపకందార్ల దాడి

- పందుల కారణంగా పంట నష్టంపై నిలదీయడంతో కక్ష సాధింపు
- ఎ.కోడూరు పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు



దాడిలో ముఖంపై దెబ్బలతో సర్పంచ్ అప్పాజీ



దాడితో ముఖం, చేతి మణికట్టుపై దెబ్బలతో రైతు బంగారునాయుడు

కె.కోటపాడు : ఆనందపురం సర్పంచ్ వంటాకు అప్పాజి, కనక దంపతులతో పాటు రైతు గురు బంగారునాయుడుపై పలువురు పందుల పెంపకందార్లు మంగళవారం దాడికి పాల్పడ్డారు. ఎ.కోడూరు ఎస్ఐ లక్ష్మీనారాయణ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఆనందపురం గ్రామంలోని రైతులు గురు బంగారునాయుడు, దేముడుబాబు, శ్రీరామ్‌కు చెందిన పొలాల్లో వరి పంటను విజయనగరం జిల్లా కృష్ణారాయుడిపేటకు చెందిన 30 పందులు సోమవారం ధ్వంసం చేశాయి. ప్రతి ఏడాది పందుల కారణంగా జరుగుతున్న పంట నష్టంను రైతులు సర్పంచ్ అప్పాజీకి వివరించారు. దీంతో మంగళవారం ఆనందపురం గ్రామంలో బాధిత రైతులతో కలిసి విజయనగరం జిల్లా కృష్ణారాయుడిపేట గ్రామానికి చెందిన పందుల పెంపకందారు యాండ్రపు ఈశ్వరరావును పిలిచి ఆయన ప్రశ్నించారు. పందులు పంట పొలాల వైపు రాకుండా చూసుకోవాలని సూచించారు. పందుల యజమాని అక్కడి నుంచి ఇంటికి వెళ్లి ఆనందపురంలో జరిగిన సంఘటనను కుటుంబ సభ్యులకు వివరించాడు. ఈశ్వరరావుతో పాటు ఆయన కుటుంబ సభ్యులైన యాండ్రపు సత్యనారాయణ, అప్పలకృష్ణ, నాయుడు, శివ, పవన్, బాలకృష్ణ, పైడిరాజు, కనకరాజు ఆనందపురం వచ్చారు. సర్పంచ్ అప్పాజీకి చెందిన షాపు వద్దకు చేరుకున్న వారంతా అక్కడే ఉన్న సర్పంచ్, ఆయన భార్య కనక, రైతు బంగారునాయుడులతో ఘర్షణకు దిగారు. ముగ్గురిపై సుత్తితో దాడికి పాల్పడడంతో గాయపడ్డారు. కనక ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ లక్ష్మీనారాయణ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

వచ్చే నెలలో సంతోష్ ట్రోఫీ లీగ్ పూల్ మ్యాచ్‌లు

విశాఖ స్పోర్ట్స్ : నవంబర్ 15 నుంచి 19 వరకు సంతోష్ ట్రోఫీలో భాగంగా ఆంధ్రప్రదేశ్ ఆడే గ్రూప్ పూల్ మ్యాచ్‌లు అనంతపురంలో జరగనున్నాయి. ఈ పూల్‌లో ఏపీతో పాటు మరో మూడు జట్లు ఆడనున్నాయని విశాఖ జిల్లా ఫుట్‌బాల్ అలయెన్స్, వెల్ఫేర్ సంఘం (వీడీఎఫ్ఏ) కార్యదర్శి ఎ.చినబాబు తెలిపారు. మంగళవారం స్థానిక ప్రెస్ క్లబ్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఐఎఫ్ఎల్ టోర్నీలో ఏపీ తరఫున గతేడాది కోరమాండల్ ఫుట్‌బాల్ క్లబ్ జట్టు పాల్గొందని తెలిపారు. వాస్తవానికి హైదరాబాద్ నుంచి ఐఎఫ్ఎల్‌కు మరో జట్టు ప్రాతినిధ్యం వహిస్తుండటంతో ఏపీ తరఫున శ్రీనిధి ఫుట్‌బాల్ క్లబ్ విశాఖలో ఫుట్‌బాల్ మౌలిక వసతులు అభివృద్ధి చేస్తామంటూ గతంలో లైసెన్స్ తీసుకున్నది వాస్తవమేనన్నారు. ఎస్ఎఫ్ఎల్ కార్యకలాపాలు హైదరాబాద్‌లోనే ఉండటంతో, ప్రత్యామ్నాయంగా విశాఖలో కోరమాండల్ ఫుట్‌బాల్ క్లబ్‌ను ఆ స్థాయిలో తీర్చిదిద్దుతున్నట్లు తెలిపారు. ఏపీలో మేటి క్లబ్‌లకు పోటీలు నిర్వహించి విజేత జట్టును ఐఎఫ్ఎల్‌కు పంపాల్సి ఉంటుందన్నారు.

మద్యం తరలిస్తున్న ఇద్దరిపై కేసు

అనకాపల్లి: మద్యం బాటిల్స్ తరలిస్తున్న ఇద్దరిపై పట్టణ పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. పట్టణ సీఐ టి.వి.విజయకుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పట్టణ, మండలంలో వాహనాలు తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో మండలంలో సీహెచ్ఎన్ అగ్రహారం గ్రామానికి చెందిన దేముళ్లు 15, కొత్తూరు పంచాయతీ దేవినగర్‌కు చెందిన శ్యామ్‌కుమార్ 10 మద్యం బాటిల్స్ తరలిస్తూ పట్టుబడ్డారు. ఈ మేరకు ఇద్దరిపై కేసులు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

యలమంచిలి రూరల్: మండలంలోని రేగుపాలెం హైవే కూడలి వద్ద మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. కాకినాడ నుంచి విశాఖపట్నం వైపు వెళ్తున్న కారు, రేగుపాలెం హైవే కూడలి వద్ద యూటర్న్ తీసుకుంటున్న ద్విచక్ర వాహనం ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో మునగపాక మండలం ఒంపోలు గ్రామానికి చెందిన జి.సురేష్ తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రుడ్ని విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. ప్రమాదం జరిగిన ప్రదేశంలో వాహనాల రాకపోకలు కొద్దిసేపు నిలిచిపోయాయి. యలమంచిలి రూరల్ పోలీసులు ప్రమాద స్థలానికి వెళ్లి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

గంజాయి తరలిస్తున్న ఇద్దరి అరెస్ట్

నర్సీపట్నం : గంజాయి తరలిస్తున్న తమిళనాడుకు చెందిన ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని టౌన్ సీఐ జి.గోవిందరావు తెలిపారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద పోలీసులు మంగళవారం వాహనాల తనిఖీలు చేపట్టారు. ఇద్దరు వ్యక్తులు బ్యాగులతో నడిచి వస్తుండగా అనుమానంతో పోలీసులు తనిఖీ చేశారు. రూ.80 వేలు విలువ చేసే 16 కిలోల గంజాయిని గుర్తించి, స్వాధీనం చేసుకున్నారు. గంజాయి తరలిస్తున్న తమిళనాడు రాష్ట్రం జండీగర్ జిల్లా, నల్లమనర్‌కు చెందిన సతీష్ నాగరాజు(27), లైన్‌మీన్ జిల్లాకు చెందిన జ్ఞానశేఖర్‌రాజు(28)ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. నిందితుల నుంచి రూ.1000 నగదు, ఒక సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నామని సీఐ తెలిపారు.

3 కేజీల గంజాయి స్వాధీనం



గంజాయితో పట్టుబడిన నిందితులు, స్కూటీతో ఎస్ఐ టి.మల్లేశ్వరరావు, తదితరులు

దేవరాపల్లి: గంజాయి అక్రమంగా తరలిస్తున్న విశాఖపట్నానికి చెందిన ఇద్దరు యువకులను దేవరాపల్లి పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. ఏజెన్సీ నుంచి గంజాయి అక్రమ రవాణా చేస్తున్నట్లు అందిన సమాచారం మేరకు మండలంలోని శ్రీరాంపురం వై జంక్షన్ వద్ద ఎస్ఐ టి.మల్లేశ్వరరావు తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో స్కూటీపై వస్తున్న ఇద్దరిని తనిఖీ చేయగా.. వారి వద్ద నుంచి 3 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. నిందితులు తొట్టి శశికుమార్, వంగలపూడి తనూజ్‌ను అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించామని ఎస్ఐ తెలిపారు.

విశాఖ నుంచి స్పెషల్ రైళ్లు

తాటిచెట్లపాలెం: ప్రయాణికుల రద్దీ దృష్ట్యా విశాఖపట్నం నుంచి దానాపూర్, భువనేశ్వర్‌లకు ప్రత్యేక రైళ్లు నడుపుతున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం సందీప్ తెలిపారు. విశాఖపట్నం-దానాపూర్ (08520) స్పెషల్ ఎక్స్‌ప్రెస్ నవంబరు 4వ తేదీ ఉదయం 9.10 గంటలకు విశాఖపట్నంలో బయల్దేరి మరుసటిరోజు ఉదయం 11 గంటలకు దానాపూర్ చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో (08519) దానాపూర్‌లో నవంబరు 5వ తేదీ మధ్యాహ్నం 12.30 గంటలకు బయల్దేరి మరుసటిరోజు బుధవారం సాయంత్రం 3.45 గంటలకు విశాఖపట్నం చేరుకుంటుంది. ఈ స్పెషల్ రైళ్లు నవంబరు 15వ తేదీ వరకు నడుస్తాయి. విశాఖపట్నం-భువనేశ్వర్(08536) స్పెషల్ ఎక్స్‌ప్రెస్ ప్రతీ రోజు మధ్యాహ్నం 12 గంటలకు విశాఖపట్నంలో బయల్దేరి అదేరోజు రాత్రి 7.45 గంటలకు భువనేశ్వర్ చేరుకుంటుంది. తిరుగుప్రయాణంలో (08535) భువనేశ్వర్‌లో ప్రతీ రోజు రాత్రి 10.30 గంటలకు బయల్దేరి మరుసటిరోజు ఉదయం 8.45 గంటలకు విశాఖపట్నం చేరుకుంటుంది. ఈ స్పెషల్ రైళ్లు నవంబరు 15వ తేదీ వరకు నడుస్తాయి.

కార్మిక శాఖ మంత్రి దృష్టికి 'అభిజిత్' కార్మికుల సమస్య



సీఐటీయూ నాయకులు ఇచ్చిన వినతి పత్రాన్ని చదువుతున్న కార్మిక శాఖ మంత్రి సుభాష్

అచ్యుతాపురం: అచ్యుతాపురం సెజ్‌లోని అభిజిత్ కంపెనీ సమస్యను వెంటనే పరిష్కరించాలని కోరుతూ కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్‌కు మంగళవారం సీఐటీయూ నేత ఆర్.రాము వినతి పత్రం అందజేశారు. అచ్యుతాపురం సెజ్‌లో ఏర్పాటు చేయనున్న ఈఎస్ఐ ఆస్పత్రి శంకుస్థాపనకు విచ్చేసిన మంత్రిని కలిసిన సీఐటీయూ నాయకులు అభిజిత్ కంపెనీ ప్రకటించిన లే ఆఫ్‌ను వెంటనే ఎత్తి వేయాలని కోరారు. కార్మిక చట్టాలను ఉల్లంఘిస్తున్న యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలన్నారు.

నియోజకవర్గ అభివృద్ధి పనులపై డిప్యూటీ సీఎంను కలిసిన హోంమంత్రి

సాక్షి, అమరావతి: పాయకరావుపేట నియోజకవర్గంలో వివిధ అభివృద్ధి పనులపై చర్చించేందుకు హోం మంత్రి అనిత మంగళవారం మంగళగిరిలోని ఉపముఖ్యమంత్రి కార్యాలయంలో పవన్ కల్యాణ్‌తో భేటీ అయ్యారు. పాయకరావుపేటలోని వాటర్ గ్రిడ్ ప్రాజెక్టు పూర్తికి చొరవ చూపాలని డిప్యూటీ సీఎంకు వినతి పత్రం సమర్పించారు. తన నియోజకవర్గంలోని పంచాయతీ కార్యాలయ భవన నిర్మాణం సహా ముఖ్యమైన అభివృద్ధి ప్రాజెక్టుల ప్రాధాన్యతను పవన్ కల్యాణ్‌కు వివరించి వాటి సత్వర పూర్తికి సహకరించాలని హోం మంత్రి విజ్ఞప్తి చేశారు. కోటవురట్ల మండలంలో లింగాపురం నుంచి కొడవటిపూడి కట్ట వరకు సుమారు కి.మీ మేర నిర్మించనున్న ఆర్ అండ్ బీ రోడ్డుకు అటవీ శాఖ అనుమతులు ఇప్పించాలని ఆమె ఈ సందర్భంగా కోరారు.

ఘనంగా ధన్వంతరి జయంతి వేడుకలు



హోమం నిర్వహిస్తున్న నరసింహారావు దంపతులు



ధన్వంతరి జయంతి వేడుకలు నిర్వహిస్తున్న వైద్యురాలు కె.లావణ్య

పాయకరావుపేట: ఆయుర్వేద మూల పురుషుడు ధన్వంతరి జయంతి, జాతీయ ఆయుర్వేద దినోత్సవం సందర్భంగా శ్రీప్రకాష్ ఆయుర్వేద ఆస్పత్రిలో మంగళవారం ధన్వంతరి హోమం ఘనంగా నిర్వహించారు. సర్వజనుల ఆరోగ్యం సుభిక్షంగా ఉండాలని కొన్నేళ్లుగా శ్రీప్రకాష్ ఆయుష్ చారిటబుల్ అండ్ రీసెర్చ్ ట్రస్ట్ ఫౌండర్ ట్రస్ట్ సిహెచ్.వి.కె. నరసింహారావు, రామసీత దంపతులు ధన్వంతరి జయంతి రోజున ఈ హోమాన్ని నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఆయుర్వేద వైద్యులు ఎం.ప్రసాద్, జటావల్లభుల ఎల్.ఎన్.శాస్త్రిలను ఘనంగా సన్మానించారు. ట్రస్ట్ ఫౌండర్ నరసింహారావు మాట్లాడుతూ ఆయుర్వేదంలో విశిష్ట సేవలందించిన వైద్యులను సన్మానించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. కేరళ రాష్ట్రంలో ప్రసిద్ధి పొందిన ఆయుర్వేద వైద్యం ఇక్కడ పరిసర ప్రాంత ప్రజలకు అందుబాటులో ఉండాలనే ఉద్దేశంతో ఇక్కడ ఆయుర్వేద చికిత్సాలయం స్థాపించి వైద్య సేవలు అందిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో విద్యా సంస్థల సంయుక్త కార్యదర్శి సిహెచ్.విజయ్ ప్రకాష్, సమీరా దంపతులు, ట్రస్ట్ అడ్వైజర్ ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఆయుర్వేద చికిత్సాలయం ప్రధాన వైద్యుడు రమేష్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

అనకాపల్లి: కరోనా వంటి విపత్తుల తరువాత ఆయుర్వేదంపై ప్రజలకు ఆసక్తి పెరిగిందని ఆయుష్మాన్ విభాగం వైద్యాధికారి కె.లావణ్య అన్నారు. స్థానిక ఎన్టీఆర్ ఆస్పత్రి ఆవరణలోని ఆయుష్ విభాగంలో మంగళవారం ధన్వంతరి జయంతి సందర్భంగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆరోగ్యకరమైన జీవనశైలి కోసం ఆయుర్వేదం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. దీర్ఘకాలిక వ్యాధులకు అనేక రకాలైన మందులు ఆయుర్వేదంలో ఉన్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో దిశ పోలీస్ స్టేషన్ ఎస్ఐ ఆలీ, యోగా శిక్షకులు ఆవుపాటి చంద్రిక, అప్పారావు, ఆయుష్మాన్ భారతి విభాగం ఉద్యోగులు పాల్గొన్నారు.

నైపుణ్య గణనపై ఎన్యూమరేటర్లకు శిక్షణ

- నిర్మాణ, ఉత్పత్తి, సేవా రంగాల్లో యువత నైపుణ్యంపై సర్వే
- వచ్చే నెల మొదటి వారం ప్రారంభం
- జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి గోవిందరావు



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎస్ గోవిందరావు

యలమంచిలి రూరల్: వచ్చే నెల మొదటి వారంలో ప్రారంభించనున్న నైపుణ్య గణన (స్కిల్ సెన్సెస్) పక్కాగా చేపట్టాలని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎస్.గోవిందరావు సూచించారు. జిల్లాలో నైపుణ్య గణన సర్వే చేపట్టబోయే ఎన్యూమరేటర్లకు మంగళవారం యలమంచిలి గురజాడ అప్పారావు ప్రభుత్వ డిగ్రీ కళాశాల స్కిల్ హబ్‌లో ఒకరోజు శిక్షణను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాష్ట్రంలో 15 నుంచి 59 సంవత్సరాల వయసున్న వారందరి నైపుణ్యాల వివరాలను సర్వేలో భాగంగా సేకరించాలన్నారు. జిల్లా కలెక్టర్ పర్యవేక్షణలో జాయింట్ కలెక్టర్ నోడల్ అధికారిగా వ్యవహరించే ఈ సర్వేకు జిల్లా క్రీడాభివృద్ధి అధికారి, జిల్లా విద్యాశాఖాధికారి సమన్వయకర్తలుగా వ్యవహరిస్తారని చెప్పారు. మండల పరిధిలో ఎంపీడీవోలు, మున్సిపాలిటీల పరిధిలో కమిషనర్లు నోడల్ అధికారులుగా ఉంటూ క్షేత్రస్థాయిలో సచివాలయాలను యూనిట్లుగా పరిగణించి సర్వే చేస్తారన్నారు. ప్రతి ఎన్యూమరేటర్‌కు నిర్దిష్ట కుటుంబాలను మ్యాపింగ్ చేస్తారన్నారు. నిర్మాణ, ఉత్పత్తి, సేవా రంగాల్లో యువతకు ఏ మేరకు నైపుణ్యం ఉందో సర్వే ద్వారా గుర్తించనున్నట్టు తెలిపారు. జిల్లాలో 24 మండలాలు, మునిసిపాలిటీల్లో సచివాలయానికి నలుగురు చొప్పున ఎంపిక చేసి శిక్షణనిచ్చారు. ఉదయం, మధ్యాహ్నం సెషన్లలో నిర్వహించిన ఈ శిక్షణలో మాస్టర్ ట్రైనర్ సంతోష్ సర్వే నిర్వహించే విధానంపై సమగ్రమైన అవగాహన వచ్చేలా ఎన్యూమరేటర్లకు వివరించారు. కార్యక్రమంలో గ్రామ, వార్డు సచివాలయాల ప్రత్యేక అధికారి మంజుల, జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి శాంతి, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పి.చంద్రశేఖర్, జిల్లా ప్లేస్‌మెంట్ అధికారి శ్రీనివాస్, సచివాలయాల డిజిటల్, వెల్ఫేర్, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

కారులో గంజాయి తరలిస్తున్న నలుగురు అరెస్ట్

- వెంబడించి పట్టుకున్న కొత్తకోట పోలీసులు
- 40 కేజీల గంజాయి స్వాధీనం

సాక్షి, అనకాపల్లి : గంజాయి రవాణా చేస్తున్న వారిపై పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. కొత్తకోట పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం తెల్లవారుజామున దొండపూడి జంక్షన్‌లో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా వోక్స్ వ్యాగన్ కారు (కెఎల్ 67సీ0134)లో గంజాయి తరలిస్తుండగా పోలీసులు అరెస్ట్ చేశారు. కల్యాణపులోవ అటవీ ప్రాంతంలో గంజాయిని రూ.90,000కు కొనుగోలు చేసి కేరళ రాష్ట్రానికి తరలించేందుకు కారులో తీసుకెళుతుండగా దొండపూడి చెక్‌పోస్టు వద్ద పోలీసులకు పట్టుబడ్డారు. ముందస్తు సమాచారంతో దొండపూడి జంక్షన్‌లో గల చెక్‌పోస్టు వద్ద తనిఖీలు నిర్వహిస్తుండగా పోలీసులను చూసి కారు డ్రైవర్ మినహా మిగతా ముగ్గురు నిందితులు పారిపోయేందుకు ప్రయత్నించారు. ఇది చూసిన పోలీసులు వెంబడించి నిందితులను అదుపులోకి తీసుకున్నారు. అనంతరం వాహనాన్ని తనిఖీ చేయగా కారు డిక్కీలో 40 కేజీల గంజాయి పట్టుబడింది. నిందితుల్లో ఒకరు కేరళకు చెందినవారు కాగా మిగతా వారు అల్లూరి, అనకాపల్లి జిల్లాలకు చెందివారు. వారి నుంచి రూ.8 వేలు, 5 మొబైల్ ఫోన్లు, 40 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో కేరళ రాష్ట్రానికి చెందిన ఏ1 నిందితుడు గంజాయిని రవాణా చేసేందుకు స్థానికులను ఇద్దరిని నియమించుకున్నాడు. వీరు ఒక కారును బుక్ చేసుకుని గంజాయి తరలిస్తుండగా పోలీసులకు పట్టుబడ్డారు. ఈ కేసులో అద్భుత ప్రతిభ కనబరిచిన కొత్తకోట ఇన్‌చార్జి అనకాపల్లి సబ్ డివిజన్ డీఎస్పీ బి.అప్పారావు, కొత్తకోట సీఐ జి.కోటేశ్వరరావు, కొత్తకోట ఎస్ఐ శ్రీనివాస్, రోలుగుంట ఎస్ఐ రామకృష్ణ, రావికమతం ఎస్ఐ రఘువర్మ, వారి సిబ్బంది జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా అభినందించి, నగదు రివార్డులు అందజేశారు.

ఉల్లాస్‌తో అక్షరాస్యత పెంపు



మాట్లాడుతున్న జెడ్పీ సీఈవో నారాయణమూర్తి

తుమ్మపాల: అక్షరాస్యత పెంపు కోసం తలపెట్టిన ఉల్లాస్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జెడ్పీ సీఈవో పి.నారాయణమూర్తి కోరారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జిల్లాలోని ఎంపీడీవోలు, డీఆర్‌డీఏ అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్లకు ఉల్లాస్ కార్యక్రమంపై ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వయోజనులైన నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా చేయడమే ఈ కార్యక్రమం ఉద్దేశమన్నారు. డీఆర్‌డీఏ పీడీ కె.శచీదేవి మాట్లాడుతూ మొదటి దశలో 11,900 మందిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వయోజన విద్య నోడల్ అధికారి డి.చిన్ని కృష్ణ, డివిజనల్ డెవలప్‌మెంట్ అధికారి ఎస్.మంజులవాణి, వయోజన విద్య స్టాటిస్టికల్ అసిస్టెంట్ పి.సూర్యారావు, జిల్లా స్థాయి రిసోర్స్ పర్సన్స్ పి.వెంటరమణ, కె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక



రాష్ట్ర స్థాయి బేస్‌బాల్ పోటీలకు ఎంపికైన వాహినితో ప్రధానోపాధ్యాయుడు సత్యనారాయణ



గుడివాడ పాఠశాలలో తేజను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

ఎస్.రాయవరం: మండల కేంద్రం ఎస్.రాయవరం ఉన్నత పాఠశాల విద్యార్థి గుజ్జేటి వాహిని రాష్ట్ర స్థాయి బేస్ బాల్ పోటీలకు అర్హత సాధించిందని ప్రధానోపాధ్యాయుడు ఎం.ఎస్.సత్యనారాయణ తెలిపారు. ఉమ్మడి విశాఖపట్నం జిల్లా స్థాయి అండర్-17 విభాగంలో ఆమె సత్తా చాటి రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించింది. ఈ మేరకు ఆమెను వ్యాయామ ఉపాధ్యాయులు శ్రీను, చైర్మన్ ప్రసాద్, వైస్ చైర్మన్, అనిత తదితరులు అభినందించారు.

- గుడివాడ ఉన్నత పాఠశాల విద్యార్థి తేజ రాష్ట్ర స్థాయి కేరమ్స్ పోటీలకు ఎంపికైనట్టు పీడీ కుందూరు రాజు తెలిపారు. ఉమ్మడి విశాఖపట్నం జిల్లా స్థాయి క్రీడల్లో అండర్-14 విభాగంలో తేజ సత్తా చాటి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. ఈ మేరకు తేజను పాఠశాలలో ఇన్‌చార్జ్ హెచ్ఎం మహేశ్వరి, ఉపాధ్యాయులు భవాని, సుధాలక్ష్మి, తదితరులు అభినందించారు.

సింహాచలం దేవస్థానంలో ఇద్దరు ఉద్యోగుల సస్పెన్షన్

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానంలో జీడిపప్పు చోరీ చేసిన ఇద్దరు ఉద్యోగులను ఈవో వి.త్రినాథరావు సస్పెండ్ చేశారు. సింహగిరిపై ప్రసాదాల తయారీ సెక్షన్‌లో లడ్డూలో కలపాల్సిన డబ్బా జీడిపప్పును జూనియర్ అసిస్టెంట్ పట్నాల సూర్యనారాయణ, పిండిమిల్లు అసిస్టెంట్ కాశీ పైడిరాజు చోరీ చేశారు. ఈ వ్యవహారంపై ఈవో విచారణ జరిపి.. ఇద్దరు ఉద్యోగులు చోరీకి పాల్పడినట్టు గుర్తించారు. ఇద్దరినీ సస్పెండ్ చేస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

వెలుగు జిలుగుల దీపావళి

అందరూ ఇష్టపడే దీపావళి పండగ వచ్చేసింది. చిన్నాపెద్దా అంతా హుషారుగా పండగ నిర్వహించుకోవడానికి ఉత్సాహం చూపుతున్నారు. ముఖ్యంగా వెలుగులు విరజిమ్మే దీపాల అమరిక కోసం పలు రకాల డిజైన్లలో ప్రమిదలు అందంగా ఆకట్టుకుంటున్నాయి. వీటిని కొనుగోలు చేసేందుకు మహిళలు ఎంతో ఆసక్తి చూపుతున్నారు.


మార్కెట్‌లో విక్రయిస్తున్న ప్రమిదలు


మార్కెట్‌లో దీపావళి సందడి

- మొదలైన పండగ సందడి
- జోరుగా ప్రమిదల విక్రయాలు
- మహిళలను ఆకట్టుకుంటున్న కొత్తకొత్త ఆకృతులు

తుమ్మపాల: పిల్లల నుంచి పెద్దల వరకూ అందరూ ఎంతో ఇష్టపడే దీపావళి పండగ వచ్చేస్తోంది. ఇప్పటికే పండగ సందడి మొదలైంది. దీపావళి అంటే వెలుగుల పండగ. అందరూ ఉత్సాహంగా బాణసంచా కాల్చి సందడి చేస్తారు. కుటుంబ సభ్యులతో కలిసి ఆనందంగా వేడుక చేసుకుంటారు. ఈ సందర్భంగా రకరకాల ప్రమిదలు అందుబాటులోకి వచ్చాయి. వివిధ ఆకృతుల్లో ఇవి చిన్న పెద్ద సైజుల్లో ఎంతో ఆకట్టుకుంటున్నాయి. సాధారణ మట్టి ప్రమిదలతో పాటు అనేక డిజైన్లలో తయారు చేసినవి ఎంతో బాగున్నాయి. వాటిని కొనడానికి ప్రజలు ఆసక్తి చూపుతున్నారు.

మట్టి ప్రమిదలు..

దీపావళి సందర్భంగా ఇంటి ముందు దీపాలు పెట్టడం మన సంప్రదాయం. ప్రతి ఇల్లు దీపాల కాంతిలో మెరిసిపోతుంటుంది. ఆకాశంలో చుక్కలు నేలకు దిగి వచ్చాయా అన్నట్టు ప్రతి ఊరూ కళకళలాడుతుంది. దీపాలను మట్టి ప్రమిదలలో వెలిగించడం మన సంప్రదాయం. పండగకు వారం రోజుల ముందు నుంచే వాటిని వీధుల్లో తిరుగుతూ విక్రయిస్తుంటారు.

విక్రయాలు మొదలు..

నియోజకవర్గంలోని కశింకోట, అనకాపల్లి మండలాలతో పాటు పట్టణంలో పలు ప్రాంతాల్లో మట్టితో తయారు చేసిన వివిధ రకాల ప్రమిదలు విక్రయానికి సిద్ధం చేశారు. ఈ ఏడాది ప్రధానంగా కొబ్బరికాయలో ఏర్పాటు చేసిన ప్రమిద ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. వీటితో పాటు తులసికోట, దీపం కుందులు, మామిడి పిందెలు, పుత్తడి బొమ్మ, శివలింగం ఆకారంలో పింగాణీతో తయారు చేసిన ప్రమిదలు అందుబాటులోకి వచ్చాయి. వీటిని రకాన్ని బట్టి డజను రూ.50 నుంచి రూ.350 వరకూ విక్రయిస్తున్నారు. సాధారణ ప్రమిదలు డజను రూ.40 పలుకుతున్నాయి.

ప్రమిదలు బాగున్నాయి..



గత ఏడాది కంటే ఈసారి కొత్త రకం ప్రమిదలు కనిపిస్తున్నాయి. మంచి డిజైన్లలో ఆకట్టుకుంటున్నాయి. ఎప్పుడూ మట్టి ప్రమిదలోనే దీపాలు వెలిగిస్తాం. ఈసారి వాటితో పాటు కొత్త డిజైన్ ప్రమిదలను కూడా కొనుగోలు చేస్తున్నాను.

– జి.రాము, శంకరం గ్రామం

కొత్తకొత్త ఆకృతులు..



దీపావళి రోజు ప్రతి ఇంటి ముందు వెలిగించిన దీపాలను చూడటానికి రెండు కళ్లూ సరిపోవు. ఎంతో అందంగా కనిపిస్తాయి. మార్కెట్‌లో కొత్త రకం ప్రమిదలు చాలా బాగున్నాయి. కొత్త డిజైన్లలో ముచ్చట గొలుపుతున్నాయి.

– వి.చిన్నారి, అనకాపల్లి

క్లుప్తంగా

తాళ్లపాలెంలో రెవెన్యూ గ్రామసభ నేడు

కశింకోట: మండలంలోని తాళ్లపాలెం పంచాయతీ కార్యాలయంలో బుధవారం ఉదయం 9 గంటల నుంచి రెవెన్యూ గ్రామ సభ జరగనుందని తహసీల్దార్ ఎ. శ్రీనివాసరావు తెలిపారు. సాయంత్రం వరకు జరగనున్న సభలో రైతులు భూ సమస్యలను తెలియజేయాలని కోరారు.

భూ సమస్యలపై అర్జీలు

కశింకోట: మండలంలోని నరసింగబిల్లి రెవెన్యూ గ్రామ సభలో భూ సమస్యలపై భారీగా అర్జీలు వచ్చాయి. మంగళవారం నిర్వహించిన ఈ సభలో కొలతల్లో హెచ్చుతగ్గులు సరి చేయాలని, రీసర్వేలో లోపాలను సవరించాలని కోరుతూ అర్జీలు వచ్చాయి. జెట్టపురెడ్డితునిలో 43 అర్జీలు వచ్చాయి. తహసీల్దార్ ఎ.శ్రీనివాసరావు సమక్షంలో నిర్వహించిన సభల్లో రీసర్వే ఉప తహసీల్దార్ భాస్కరరావు, మండల సర్వేయర్ రామారావు, ఆర్‌ఐ రమేష్, సచివాలయ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

అలరించిన బృందగాన పోటీలు


పాటల పోటీలో పాల్గొన్న విద్యార్థులు

నర్సీపట్నం : పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో జరుగుతున్న ప్రతిభా పాటవ పోటీల్లో భాగంగా మంగళవారం నిర్వహించిన బృందగాన పోటీలు అలరించాయి. ఈ పోటీల్లో జిల్లాలోని పలు పాఠశాలల నుంచి 35 బృందాలు పాల్గొన్నాయి. ఈ పోటీలకు న్యాయ నిర్ణేతలుగా నక్క వరలక్ష్మి, ఎస్తేరు రాణి, సంఘమిత్ర వ్యవహరించారు. పీఆర్టీయు అధ్యక్షుడు డి.గోపీనాథ్ మాట్లాడుతూ గత 18 ఏళ్లుగా బాలల దినోత్సవం వేడుకలు నిర్వహిస్తున్నామన్నారు. వారిలో ఉన్న ప్రతిభను వెలికి తీయడం ద్వారా వారు అనేక పోటీల్లో విజయం సాధిస్తూ వ్యక్తిగతంగా ఎదుగుతున్నారని గోపీనాథ్ అన్నారు.

రోడ్డు ప్రమాదంలో దంపతులకు గాయాలు

అనకాపల్లి: స్థానిక సుంకరమెట్ట జంక్షన్ వద్ద రెండు బైకులు మంగళవారం రాత్రి ఢీకొన్నాయి. పరవాడ మండలం లంకెలపాలెం గ్రామానికి చెందిన భార్యాభర్తలు గల్లా శంకరరావు, లక్ష్మి దంపతులు లంకెలపాలెం నుంచి అనకాపల్లి వస్తుండగా జంక్షన్ వద్ద మరో ద్విచక్ర వాహనం ఢీకొనడడంతో దంపతులకు స్వల్ప గాయాలయ్యాయి. ఈ మేరకు ఆమె ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు మంగళవారం 1045 దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్ రకం	4,310	4,975
మొదటి రకం	3,660	5,050
రెండో రకం	3,300	4,310
మూడోరకం	3,260	3,350

అనకాపల్లి సినిమాలు

దేవర	:రాజా
విశ్వం	:సత్యనారాయణ స్క్రీన్-1
వీణం 3డీ 2	:సత్యనారాయణ స్క్రీన్-2
జనక అయితే గనక	:పర్లిసాయి
వేట్టయాన్	:షిర్డీసాయి
నరుడి బతుకు నటన	:వెంకటేశ్వర
ఎంత పనిచేశావ్ చంటి	:శ్రీసత్య
పొట్టేల్	:రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి: ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 26 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్ – 1 యూనిట్, బీ పాజిటివ్-18 యూనిట్లు, ఓ పాజిటివ్-4 యూనిట్లు, ఏబీ పాజిటివ్-3 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంక్ టెక్నీషియన్ యు.లోకేష్‌ను 97036 19706 నంబరులో సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా మంగళవారం 395 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 336 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధిని 08924-223595 నంబరు ద్వారా సంప్రదించవచ్చు.

వరిలో సుడిదోమ, పొడతెగులుపై దృష్టి సారించాలి


మాట్లాడుతున్న ఏడీఆర్ ముకుందరావు

అనకాపల్లి: వాతావరణ పరిస్థితుల వల్ల వరిలో సుడిదోమ, పొడతెగులు ఆశించే అవకాశం ఉందని, మోనోక్రోటోఫాస్ 2.2 మిల్లీలీటర్లు, హెక్సాకొనజోల్ 2 మిల్లీలీటర్లు లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం ఏడీఆర్ డాక్టర్ సీహెచ్ ముకుందరావు తెలిపారు. స్థానిక ఆర్‌ఏఆర్‌ఎస్ కార్యాలయంలో మంగళవారం శాస్త్రవేత్తలతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వరిలో కంకినల్లి ఆశించినట్లయితే స్పైరోమెసిఫెన్ 1 మిల్లీలీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలని, కంకి దశలో ఉన్న వరి పైరులో మానిపండు తెగులు వచ్చే అవకాశం ఉన్నందున్న, ముందు జాగ్రత్త చర్యగా ప్రోపికొనజోల్ 1 మిల్లీలీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలని తెలిపారు. రబీలో మొక్కజొన్న వేసే రైతులు అధిక దిగుబడినిచ్చే డీహెచ్ఎం 117, 111, 119 వంటి రకాలను ఎంపిక చేసుకుని ఎకరాకు 8 కిలోల చొప్పున కాప్టన్ లేదా మాంకొజేబ్ మందు 3 గ్రాములు కిలో విత్తనానికి విత్తన శుద్ధి చేసి వేసుకోవాలని చెప్పారు. ఆఖరి దుక్కిలో ఎకరాకు 55 కిలోల యూరియా, 220 కిలోల సింగిల్ సూపర్ ఫాస్పేట్, 60 కిలోల మ్యురేట్ ఆఫ్ పొటాష్‌ను వేసుకోవాలని, కలుపు నివారణకు విత్తిన 3 రోజులలోపు అట్రాజిన్ కలుపు మందును లీటరు నీటికి 5 గ్రాముల చొప్పున కలిపి పిచికారీ చేయాలని తెలిపారు. విత్తనం కోసం పండించే జనుము విత్తనం వ్యవసాయ పరిశోధనా స్థానంలో రైతులకు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు కె.వి.రమణమూర్తి, వి.గౌరీ, ఎం.విశాలాక్షి, పి.వి.పద్మావతి, ఎ.అలివేణి పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలాలను ప్రజా ప్రయోజనాలకే వినియోగించాలి

తుమ్మపాల: ప్రభుత్వ స్థలాలను ప్రజా ప్రయోజనాలకు వినియోగించకుండా ప్రైవేటు వ్యక్తులకు, వివిధ అసోసియేషన్ల పేరుతో కేటాయించడాన్ని వ్యతిరేకిస్తు సమాజ్ వాదీ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోన గురవయ్య యాదవ్ కలెక్టర్ విజయ కృష్ణన్‌కు మంగళవారం ఫిర్యాదు చేశారు. నిబంధనలకు వ్యతిరేకంగా నర్సీపట్నం ఎమ్మార్వో కార్యాలయం కాంపౌండ్‌లో సర్వే నంబర్ 122-7 ప్రభుత్వ భూమిలో వివిధ సంఘాలు, పలు అసోసియేషన్ల పేరుతో కమర్షియల్ షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించి, వాటిని అద్దెలకు ఇచ్చి స్వార్థ ప్రయోజనాలకు అధికారులు కేటాయింపులు చేస్తున్నారని తెలిపారు. ఇందుకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన జీవోలను ఆమె పరిశీలించాలన్నారు. ఆ కేటాయింపులను రద్దు పరిచి ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని కోరారు. ఇక ముందు కూడా అసోసియేషన్ల పేరుతో అక్రమ కేటాయింపులు చేయకుండా తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

జాగ్రత్తలు పాటిస్తే తెగుళ్లు దూరం


తుమ్మపాలలో పొలం పిలుస్తుంది కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు

అనకాపల్లి: మండలంలోని సీతానగరం, తుమ్మపాల గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని మండల వ్యవసాయశాఖ అధికారి పి.రంగాచారి ఆధ్వర్యంలో నిర్వహించారు. వరిలో తెగులు, ఆకుముడత నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తలను సహాయ సంయుక్త సంచాలకుడు రామారావు రైతులకు వివరించారు. పంటలు తెగుళ్ల బారిన పడకుండా సకాలంలో మందులు పిచికారీ చేయాలని సూచించారు. ఉద్యానశాఖ ద్వారా అందిస్తున్న సంక్షేమ పథకాల గురించి జిల్లా ఉద్యానవన శాఖ అధికారి ప్రభాకరరావు రైతులకు వివరించారు. కార్యక్రమంలో సాయిల్ కన్జర్వేషన్ ఏడీ మురళి, రైతు నాయకులు తాతనాయుడు, కోన అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

గ్రామసభలో 39 దరఖాస్తులు


సభలో మాట్లాడుతున్న తహసీల్దార్ వేణుగోపాల్

నాతవరం: మండలంలో కొడవటిపూడి అగ్రహారం గ్రామంలో మంగళవారం రెవెన్యూ గ్రామ సభ నిర్వహించారు. పంచాయతీలో రెవెన్యూ పరమైన సమస్యలు ఉంటే సభ దృష్టికి తీసుకువస్తే నిబంధనల ప్రకారం సరి చేస్తామని తహసీల్దార్ ఎ.వేణుగోపాల్ అన్నారు. రెవెన్యూ గ్రామసభలో 39 మంది రైతులు దరఖాస్తులు చేశారన్నారు.

కె.కోటపాడు : కె.కోటపాడు గ్రామంలో మంగళవారం రీ సర్వే గ్రామసభను నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టాదార్ పాస్ పుస్తకాల్లో పేర్లు నమోదులో తప్పులతో పాటు ఆధార్ నంబర్లు, భూ విస్తీర్ణం, సర్వే నంబర్లులో తప్పులను సరి చేయాలని 33 మంది అర్జీలను అందించారు. తహసీల్దార్ భాగ్యవతి, రీసర్వే డీటీ సూరి, మండల సర్వేయర్ రామచంద్రమూర్తి, వీఆర్వో జగదీష్ పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధిపై దృష్టి


అభివృద్ధి పనులకు శ్రీకారం చుడుతున్న ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ

కశింకోట: గ్రామాల అభివృద్ధిపై కూటమి ప్రభుత్వం దృష్టి సారించిందని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ అన్నారు. మండలంలోని ఏనుగుతుని, నూతలగుంటపాలెం, నరసింగబిల్లి, అడ్డాం గ్రామాల్లో పల్లె పండగ కార్యక్రమంలో సిమెంట్ రోడ్లు, మురుగు కాలువ నిర్మాణ పనులకు సోమవారం శ్రీకారం చుట్టారు. జల్‌జీవన్ మిషన్ కార్యక్రమంలో ఇంటింటి కుళాయి కనెక్షన్లు ఇస్తామన్నారు. దీపావళికి ఉచిత గ్యాస్ సిలెండర్ల పంపిణీ కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. జెట్టపురెడ్డితునిలో నిర్వహించిన రెవెన్యూ గ్రామ సభ నిర్వహణ తీరును పరిశీలించారు. కార్యక్రమాల్లో బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పొన్నగంటి అప్పారావు, తెలుగు రైతు అధికార ప్రతినిధి గొంతిన శ్రీనివాసరావు, మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు వేగి గోపీకృష్ణ, డీసీసీబీ డైరెక్టర్ సిదిరెడ్డి శ్రీనివాసరావు, పాల సంఘం మాజీ అధ్యక్షుడు కర్రి వెంకట సత్యనారాయణ, పంచాయతీరాజ్ డీఈ వేణుగోపాల్, ఎంపీడీవో వి.వి. రవికుమార్, తహసీల్దార్ ఎ. శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

బ్యాంక్ ఖాతాదారులకు జన సురక్ష పథకాలు


గొండుపాలెంలో జన సురక్ష పథకాలను వివరిస్తున్న బ్యాంక్ సిబ్బంది

కె.కోటపాడు : బ్యాంక్‌లో ఖాతా కలిగి 18 ఏళ్ల పైబడిన వారు తప్పకుండా జన సురక్ష పథకాల్లో చేరాలని చౌడువాడ ఏపీజీవీబీ బ్యాంక్ ఫీల్ అధికారి బి.మల్లికార్జున్, అకౌంటెంట్ ఎం.చిట్టి వికాస్ అన్నారు. గొండుపాలెం గ్రామంలో మంగళవారం ఖాతాదారులకు జన సురక్షా పథకంలో అమలు చేస్తున్న పీఎం సురక్షా బీమా యోజన, జీవన్ జ్యోతి బీమా పథకాలపై అవగాహన కల్పించారు. ఏడాదికి రూ.20 ప్రీమియం నగదును చెల్లించిన ఖాతారులకు పీఎం సురక్షా బీమా యోజన పథకం వర్తింపచేసునున్నట్టు తెలిపారు. ఈ పథకం ద్వారా ఏడాది కాలంలో 18 నుంచి 70 ఏళ్ల వయస్సు గల వారు ప్రమాదాల బారిన పడి మరణించిన సమయాల్లో వారి కుటుంబాలకు బ్యాంక్ ద్వారా రూ.2 లక్షల నగదును అందించనున్నట్టు బి.మల్లికార్జున్, ఎం.చిట్టి వికాస్ తెలిపారు. పీఎం జీవన్ జ్యోతి బీమా యోజన పథకం ద్వారా ఏడాదికి రూ.436 చెల్లిస్తే 18 నుంచి 50 ఏళ్ల లోపు వారికి ప్రమాదవశాత్తూ లేదా సహజ మరణం వాటిల్లినా వారి కుటుంబ సభ్యులకు రూ.2 లక్షల నగదును ఇవ్వనున్నట్టు వీరు వివరించారు. ఈ పథకాల్లో తప్పనిసరిగా బ్యాంక్ ఖాతాదారులు చేరాలని ఖాతాదారులకు సూచించారు. వీటితో పాటు తక్కువ వడ్డీకే వ్యవసాయ రుణాలను రైతులకు బ్యాంక్ ద్వారా మంజూరు చేస్తున్నట్టు తెలిపారు. ఏడాది లోపు వ్యవసాయ రుణాలను చెల్లించడం ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే వడ్డీ రాయితీని పొందే పరిస్థితి ఉంటుందని అన్నారు.

సకాలంలో విత్తనాలు, ఎరువులు అందించండి

కశింకోట: రబీ సీజన్‌కు అవసరమయ్యే విత్తనాలు, ఎరువులు రైతులందరికీ సకాలంలో అందేటట్లు చర్య లు తీసుకోవాలని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ కోరా రు. మండలంలోని అడ్డాం గ్రామంలో మంగళవారం నిర్వహించిన పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. దీనిలో భా గంగా వ్యవసాయ క్షేత్ర పరిశీలన చేశారు. ఈ సందర్భంగా ఎంటీయు 1224 వరి వంగడం సాగు గురించి వ్యవసాయ అధికారి స్వప్నను అడిగి తెలుసుకు న్నా రు. రైతులతో మాట్లాడి వారి సమస్యలపై చర్చించా రు. వ్యవసాయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రైతుల నుంచి వచ్చిన వినతులన్నీ పరిష్కరిస్తాం


కొరుప్రోలు గ్రామ సభలో రైతుల సమస్యలు తెలుసుకుంటున్న తహసీల్దార్ నాగమ్మ

రోలుగుంట: రైతుల భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూశాఖ నిర్వహిస్తున్న గ్రామ సభలు చక్కని వేదిక అని ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ శెట్టి నాగమ్మ కోరారు. మండలం కొరుప్రోలు గిరిజన గ్రామంలో మంగళవారం గ్రామ సభ నిర్వహించారు. రైతుల నుంచి వచ్చిన వినతులను ఆర్ఐ రామ్మూర్తి స్వీకరించారు. కోర్టు, ఆర్థిక సంబంధమైన వినతులు మినహా అన్ని అర్జీలను పరిశీలించి పరిష్కరించడం జరుగుతుందన్నారు. డిప్యూటీ తహసీల్దార్ శంకర్రావు, సర్వేయర్ తవిటినాయుడు పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి



తహసీల్దార్ కార్యాలయం వద్ద వినతిపత్రం అందజేస్తున్న ఎస్ఎఫ్ఐ ప్రతినిధులు

కశింకోట: పెండింగ్‌లో ఉన్న విద్యా దీవెన, వసతి దీవెన, ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ ప్రతినిధులు డిమాండ్ చేశారు. కశింకోట తహసీల్దార్ కార్యాలయం వద్ద మంగళవారం ధర్నా నిర్వహించారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం. రమణ మాట్లాడుతూ గతేడాది నుంచి డిగ్రీ, పీజీ, బీటెక్, డిప్లమో, ఐటీఐ చదువుతున్న విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వడం లేదన్నారు. దీంతో ఫీజులు చెల్లించలేక విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఇబ్బంది పడుతున్నారన్నారు. తక్షణమే నిధులు మంజూరు చేయకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు అర్జున్, తరుణ్, విద్యార్థులు పాల్గొన్నారు.

తక్షణమే ఫీజ్ రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలి


పోస్టర్ ఆవిష్కరిస్తున్న రమణ తదితరులు

అనకాపల్లి: పెండింగ్‌లో ఉన్న విద్యార్థుల ఫీజ్ రియింబర్సెమెంట్ బకాయిలు ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం.రమణ అన్నారు. స్థానిక దొడ్డిరామునాయుడు భవనంలో మంగళవారం గోడ పత్రికలను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యా దీవెన, విద్యా వసతి, ఫీజు రీయింబర్స్‌మెంట్, తల్లికి వందనం వెంటనే అమలు చేయాలని అన్నారు. జిల్లాలో వేల సంఖ్యల ప్రైవేట్, ప్రభుత్వ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఫీజ్ రియింబర్స్‌మెంట్ ఇవ్వకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఈ భారం తల్లిదండ్రులపై ఒత్తిడి పెంచుతుందన్నారు. ఒకవైపున సెమిస్టర్ పరీక్షలు వస్తున్నా కాలేజీ ఫీజు కట్టకపోతే పరీక్ష ఫీజ్ కట్టించుకోమని కాలేజీ యాజమాన్యాలు చెప్పడం ఆందోళనకు గురి చేస్తుందన్నారు. ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకుని విద్యార్థుల ఫీజ్ రియింబర్స్‌మెంట్‌ను తక్షణమే విడుదల చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు కె.అర్జున్, తరుణ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గౌరమ్మ నిలుపు ఉత్సవం


ఆలయం వద్ద నెలకొల్పుతున్న గౌరమ్మ విగ్రహం

కశింకోట: స్థానిక డీపీఎన్ జెడ్పీ హైస్కూల్ వద్ద ఆలయంలో గౌరీపరమేశ్వరుల (గౌరమ్మ) విగ్రహం నిలుపు ఉత్సవాన్ని సోమవారం అర్ధరాత్రి ఘనంగా నిర్వహించారు. ముందుగా గౌరమ్మ విగ్రహాన్ని గ్రామంలో డప్పులు, వాయిద్యాలు, నృత్యాల నడుమ ఊరేగించారు. జాతీయ రహదారి నుంచి ఊరేగింపు నిర్వహించిన అనంతరం ఆలయంలో విగ్రహాన్ని నెలకొల్పి, ప్రత్యేక పూజలు చేశారు. గౌరీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఉత్సవ కమిటీ నిర్వాహకులు వేగి గోపీకృష్ణ, పెంటకోట రాము, భీశెట్టి ఆనంద్, వేగి తారకేశ్వరరావు, వేగి జగ్గారావు, అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

- స్థానిక వెలంపేటలోని ఆలయంలోనూ గౌరమ్మ విగ్రహాన్ని నెలకొల్పి, ప్రత్యేక పూజలు చేశారు.

కాంట్రాక్ట్ కార్మికుల ధర్నా


ఎన్టీఆర్ వైద్యాలయం వద్ద ధర్నా చేస్తున్న కాంట్రాక్టు కార్మికులు

అనకాపల్లి: జిల్లాలోని ప్రభుత్వ ఆస్పత్రిలో కాంట్రాక్టు పద్ధతిలో విధులు నిర్వహిస్తున్న పారిశుధ్య, సెక్యూరిటీ సిబ్బంది, పెస్ట్ కంట్రోల్ కార్మికులను పురపాలక కార్మికుల తరహాలో ఆప్కాస్‌లో కలపాలని ఆంధ్రప్రదేశ్ మెడికల్ కాంట్రాక్ట్, ఎంప్లాయీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూడోట ప్రకాష్ డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్ కార్మికులతో కలసి స్థానిక ఎన్టీఆర్ ఆస్పత్రి వద్ద మంగళవారం ధర్నా చేపట్టారు. ఆయన మాట్లాడుతూ సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు సమానపనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. వైద్యారోగ్య శాఖ కాంట్రాక్ట్ కార్మికుల సొమ్ము కాజేసిన కాంట్రాక్టర్లపై ప్రభుత్వం సమగ్ర విచారణ జరపాలని, కార్మికుల నగదును ప్రభుత్వమే చెల్లించాలని కోరారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఖాళీగా ఉన్న పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కోన లక్ష్మణ్, కార్మికులు సత్యవతి,కిరణ్, వర ప్రసాద్, చిన్న అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో దీపావళి పండగ శోభ


చోడవరం పట్టణంలో హైస్కూల్ గ్రౌండ్‌లో సందడిగా ఉన్న బాణసంచా విక్రయ దుకాణాలు


రకరకాల డిజైన్లతో ప్రమిద దీపాల వెలుగులు

చోడవరం : దీపావళి పండగ శోభతో గ్రామాలన్నీ సందడిగా మారాయి. అమావాస్య చీకట్లు పారద్రోలి జీవితాల్లో కొత్త వెలుగు నింపుకోవాలనే ఆకాంక్షతో దీపావళి పండగను ఘనంగా జరుపుకొనేందుకు ప్రజలంతా ఎంతో ఉత్సాహంతో ఒకరోజు ముందు నుంచే అన్ని ఏర్పాటు చేశారు. చోడవరం, మాడుగుల నియోజకవర్గాలకు వ్యాపార కేంద్రమైన చోడవరం పట్టణం పండగ శోభతో సందడి చోటు చేసుకుంది. ఒక పక్క బంగారం, వస్త్ర దుకాణాలు కొనుగోలు అమ్మకాలతో హడావిడిగా ఉండగా, అమావాస్య చీకట్లో వెలుగులు జిమ్మే బాణాసంచా దుకాణాలు మరీ కిటకిటలాడాయి. చోడవరం హైస్కూల్ గ్రౌండ్‌లో బాణాసంచా విక్రయ కేంద్రాలు ఒకే చోట ఏర్పాటు చేయడంతో ఆ ప్రాంతమంతా అమ్మకాలతో హడావిడి నెలకొంది. అయితే బాణాసంచా ధరలు మాత్రం ఆకాశాన్నంటడంతో పేద, మధ్యతరగతి వర్గాల ప్రజలకు ఉన్నంతలోనే సంతృప్తి పడాల్సిన పరిస్థితి నెలకొంది. మట్టి ప్రమిదలు, కొవ్వొత్తుల అమ్మకాలు కూడా జోరుగా సాగాయి. పిల్లలు, యువకుల్లో దీపావళి సంబరం ముందే రావడంతో సోమవారం నుంచి బాణాసంచా అమ్మకాలు ప్రారంభించారు. ఇళ్లు, షాపింగ్‌లు, ఆలయాలు అన్నీ రంగురంగుల విద్యుత్ దీపాలంకరణతో కనువిందు చేశాయి. పండ్లు, పూలు, చెరకు గెడలు, పూజాసామాగ్రి దుకాణాలతో పట్టణంలోని మెయిన్‌రోడ్డు, చినబజార్ వీధి, గవరవరం రోడ్డు, పాతబస్టాండ్ జంక్షన్లు జనంతో రద్దీగా మారాయి. చోడవరం, గోవాడ,వెంకన్నపాలెం, జుత్తాడ, గవరవరం, నర్సాపురం తదితర గ్రామాల్లో దీపావళి సంబరాల కోసం ప్రత్యేక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.